
sahanamvande.com

సహనం వందే

epaper.sahanamvande.com


హైదరాబాద్ | 19-11-2026 గురువారం | సంపుటి-02 సంచిక : 198 EDITOR: ROHINI





న్యూయార్క్‌ను తలదన్నేలా హైదరాబాద్

గ్లోబల్ రిటైల్ మార్కెట్లులో సంచలన ర్యాంక్



CUSHMAN & WAKEFIELD

- కుషన్ అండ్ వాగ్‌ఫీల్డ్ రిపోర్ట్ వెల్లడి
- భాగ్యనగరం ప్రపంచ బ్రాండ్ల కొత్త సామ్రాజ్యం
- జూబ్లీహిల్స్ మెరిసే వీధులకు ప్రపంచం ఫిదా!
- బంజారాహిల్స్ రాజసం.. ప్రపంచం దాసోహం!
- హిమాయత్‌నగర్ సత్తా.. గ్లోబల్ మార్కెట్ మోత!
- ఈ మూడు ప్రాంతాలకు అంతర్జాతీయ రికార్డులు
- బెంగళూరు, ముంబై, ఢిల్లీలకు హైదరాబాద్ చెక్!

మనం రోజూ సరదాగా షాపింగ్ చేయడానికి వెళ్లే మన హైదరాబాద్ వీధులు ఇప్పుడు ఏకంగా అంతర్జాతీయ స్థాయికి ఎదిగిపోయాయి. లండన్, న్యూయార్క్ లాంటి పెద్ద పెద్ద నగరాలతో పోటీ పడుతూ మన భాగ్యనగరం గ్లోబల్ రిటైల్ మ్యాప్‌లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ప్రముఖ గ్లోబల్ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ కుష్మన్ అండ్ వాగ్‌ఫీల్డ్ తాజాగా విడుదల చేసిన ఆసియా-పసిఫిక్ రిపోర్టులో హైదరాబాద్‌లోని మూడు ప్రధాన ప్రాంతాలకు అరుదైన గుర్తింపు దక్కింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హిమాయత్‌నగర్ ప్రాంతాలు ఈ ప్రతిష్టాత్మక జాబితాలో నిలవడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

- సహనం వందే, హైదరాబాద్

ఈ అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో మొదటగా చెప్పుకోవాల్సింది జూబ్లీహిల్స్ గురించి. సినిమా సెలబ్రిటీల నివాసాల నుంచి అత్యంత ఖరీదైన లగ్జరీ బ్రాండ్ల వరకు అన్నీ ఇక్కడే కొలువుదీరాయి. ఇక్కడి రోడ్లపై నడుస్తుంటే ఏదో విదేశీ వీధుల్లో తిరుగుతున్న అనుభూతి కలుగుతుంటుంది. ఇంటర్నేషనల్ క్లాత్ బ్రాండ్లు, హై-ఎండ్ రెస్టారెంట్లు, కార్పొరేట్ ఆఫీసులతో ఈ ప్రాంతం ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటుంది. కుష్మన్ అండ్ వాగ్‌ఫీల్డ్ రిపోర్ట్ ప్రకారం, జూబ్లీహిల్స్ ప్రాంతం రిటైల్ రంగంలో తన సత్తా ఏంటో మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది.

రాజసం ఉట్టిపడే బంజారాహిల్స్

దశాబ్దాలుగా హైదరాబాద్ షాపింగ్ కల్చర్‌కు మారుపేరుగా నిలిచిన బంజారాహిల్స్ ఈ జాబితాలో రెండో ప్రధాన ప్రాంతంగా నిలిచింది. పాత కాలపు రాజసం ఉట్టిపడే ఈ ఏరియాలో ఇప్పుడు అత్యాధునిక మాల్స్, అంతర్జాతీయ స్థాయి షాపింగ్ కాంప్లెక్స్‌లు వెలిశాయి. సామాన్యుడి నుంచి అత్యంత సంపన్నుల వరకు అందరికీ కావాల్సిన వస్తువులు దొరికే అడ్డాగా ఇది మారింది. ఎక్కడ చూసినా పెద్ద పెద్ద బ్రాండ్ల షోరూమ్‌లు, కస్టమర్లను ఆకట్టుకునే డిజైనర్ స్టోర్లు ఈ వీధులను మరింత సుందరంగా మారుస్తున్నాయి.

సామాన్యుల అడ్డా హిమాయత్‌నగర్

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ కేవలం లగ్జరీకి కేరాఫ్ అడ్రస్‌గా ఉంటే, మూడో ప్రాంతమైన హిమాయత్ నగర్ మాత్రం సామాన్యుల నుంచి మధ్యతరగతి ప్రజల వరకు అందరికీ అందుబాటులో ఉండే షాపింగ్ హబ్‌గా గుర్తింపు పొందింది. ఎల్లప్పుడూ రద్దీగా ఉండే రోడ్లు, వైవిధ్యమైన దుకాణాలు, అన్ని రకాల వ్యాపార సంస్థలతో ఈ ప్రాంతం నిత్యం సందడిగా ఉంటుంది. ఒకే చోట అన్ని రకాల వస్తువులు లభించడం వల్ల నగర నలుమూలల నుంచి జనం ఇక్కడికి వస్తుంటారు. ఇన్ని ప్రత్యేకతలు ఉన్నందువల్లే హిమాయత్‌నగర్ కూడా గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో సముచిత స్థానం దక్కించుకుంది.

మారుతున్న జీవనశైలి - పెరిగిన కొనుగోలు శక్తి

ఈ మూడు ప్రాంతాలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం వెనుక నగరంలో మారుతున్న జీవనశైలి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గతంతో పోలిస్తే ప్రజల కొనుగోలు శక్తి గణనీయంగా పెరిగింది. కేవలం స్థానిక ఉత్పత్తులకే పరిమితం కాకుండా ఇంటర్నేషనల్ బ్రాండ్లను కొనుగోలు చేసేందుకు జనం ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. సాధారణంగా ఇలాంటి గ్లోబల్ రిటైల్ ర్యాంకింగ్స్‌లో ముంబై, ఢిల్లీ, బెంగళూరు లాంటి మెట్రో నగరాల పేర్లు మాత్రమే వినిపించేవి. కానీ ఇప్పుడు హైదరాబాద్ కూడా బలంగా తన ముద్ర వేయడం గర్వకారణం.

పెట్టుబడులకు పెరగనున్న అవకాశాలు

కుష్మన్ అండ్ వాగ్‌ఫీల్డ్ లాంటి సంస్థలు చేసే సర్వేల ఆధారంగానే విదేశీ పెట్టుబడిదారులు ఎక్కడ వ్యాపారం చేయాలనే నిర్ణయాలు తీసుకుంటారు. హైదరాబాద్‌లోని ఈ మూడు ప్రాంతాలు ఆసియా-పసిఫిక్ లిస్ట్‌లో ఉండటం వల్ల భవిష్యత్తులో మరిన్ని గ్లోబల్ కంపెనీలు మన నగరంలో స్టోర్లను ఏర్పాటు చేసేందుకు పోటీ పడతాయి. దీనివల్ల ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, అంతర్జాతీయ బ్రాండ్లకు పోటీగా స్థానిక వ్యాపారులు కూడా తమ ప్రమాణాలను, నాణ్యతను పెంచుకునే అవకాశం ఏర్పడుతుంది.

భవిష్యత్తుకు బంగారు బాట

ప్రభుత్వాలు అందిస్తున్న మౌలిక వసతులు, పెరుగుతున్న రియల్ ఎస్టేట్ రంగం హైదరాబాద్ రిటైల్ విస్తరణకు మరింత ఊతమిస్తున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒకప్పుడు చిన్న చిన్న దుకాణాలతో ఉన్న మన గల్లీలు నేడు గ్లోబల్ బ్రాండ్లకు అడ్డాగా మారడం మన ఆర్థిక ప్రగతికి నిదర్శనం. రాబోయే రోజుల్లో నగరంలోని ఇతర ప్రాంతాలు కూడా ఈ రేసులో ముందుకు వచ్చి, మన హైదరాబాద్ ప్రపంచంలోని నంబర్ వన్ రిటైల్ హబ్‌గా ఎదగడం ఖాయంగా కనిపిస్తోంది. అంతిమంగా ఈ పోటీ వల్ల నాణ్యమైన ఉత్పత్తులు, మెరుగైన సేవలు అంది సామాన్య వినియోగదారుడికే ఎక్కువ లాభం చేకూరనుంది.

పవన్‌తో 20 ఏళ్ళ ప్రయాణం

రుక్మిణి కోటా సంచలన ప్రకటన

- ఆయనను వివాదంలోకి లాగొద్దని సూచన
- రాజకీయ కుట్ర జరుగుతోందని ఆవేదన
- మీడియా కథనాలపై అభ్యంతరం
- ఎప్పటికీ జనసైనికురాలిగానే కొనసాగుతానని వెల్లడి

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేరును ఓ వ్యవహారంలోకి తీసుకురావడంపై ఆ పార్టీ నాయకురాలు రుక్మిణి కోటా తీవ్రంగా స్పందించారు. తనపై వస్తున్న ఆరోపణల వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. కొన్ని మీడియా సంస్థలు వాస్తవాలను పక్కనపెట్టి, తప్పుదారి పట్టించే కథనాలు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. తన వ్యక్తిగత ప్రతిష్ఠతో పాటు పవన్ కళ్యాణ్ పేరును కూడా వివాదంలోకి లాగడం సరికాదని స్పష్టం చేశారు. ఇంతకీ ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు కారణం ఏమిటి?

- సహనం వందే, అమరావతి



తన రాజకీయ ప్రస్థానం ఇప్ప టిది కాదని రుక్మిణి కోటా గుర్తుచేశారు. 2007లో కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్ తో తన ప్రయాణం మొదలైందని, 2009 లో ప్రజారాజ్యం పార్టీలో కొనసాగానని వెల్లడించారు. అప్పటి నుంచి పవన్ కళ్యాణ్ నాయకత్వంపై తనకు నమ్మకం ఉందని చెప్పారు. ఆయన ఆశయాల పట్ల గౌరవం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తన రాజకీయ నిబద్ధతలో మార్పు ఉండబోదని ప్రకటిం చారు. వ్యక్తిగత ఆరోపణలతో తన రాజకీయ ప్రయాణాన్ని దెబ్బతీయలేరని ఆమె సంకేతాలిచ్చారు.

వ్యక్తిగత ఆరోపణలపై ఆగ్రహం

తనను రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగ తంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని రుక్మి ణి కోటా ఆరోపించారు. ఒక మహిళగా తన ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా కథనాలు ప్రచారం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. తన కుటుంబాన్ని కూడా వివాదాల్లోకి లాగడాన్ని సహించబోనని హెచ్చరించారు. వ్యక్తిత్వ హననం, తప్పుడు ప్రచారం ద్వారా తనను భయపెట్ట లేరని స్పష్టం చేశారు. తనపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, దాచుకోవాల్సిన విషయాలేవీ లేవని ధీమా వ్యక్తం చేశారు. అవసరమైతే తన గౌరవానికి భంగం కలిగించిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని ప్రకటించారు.

పవన్ కళ్యాణ్ పేరును ఎందుకు ప్రస్తావిస్తున్నారు?

ఈ వివాదంలో పవన్ కళ్యాణ్ పేరును అనవసరంగా ప్రస్తావించడంపై రుక్మిణి కోటా అభ్యంతరం వ్యక్తం చేశారు.

పూర్తి కథనం కోసం sahanamvande.comను సందర్శించండి

ఆమడ దూరంలో అల్లా రాజ్యం

పదేళ్లలో ప్రపంచంలో పెద్ద మతంగా ముస్లిం

- క్రిస్టియన్ జనాభాను మించిపోనున్న ఇస్లాం
- దీనికి ప్రధాన కారణం జననాల రేటే
- 'ప్యూ రీసెర్చ్ సెంటర్' అంచనాల సంచలనం
- ఇండియా, యూరప్, అమెరికాలలో ముస్లిం సునామీ
- గత ఐదేళ్లలో 25 కోట్ల మంది ముస్లిం పిల్లలు పుట్టారు



ప్రపంచ జనాభా లెక్కల్లో రాబోయే దశాబ్దాల్లో భారీ మార్పులు రాబోతున్నాయని ప్యూ రీసెర్చ్ సెంటర్ అంచనా వేసింది. ఇప్పటివరకు ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన మతంగా క్రైస్తవం అగ్రస్థానంలో ఉండగా, రాబోయే పదేళ్లలో ఆ స్థానాన్ని ఇస్లాం చేజిక్కించుకునే అవకాశం కనిపిస్తోంది. కేవలం సంఖ్యల పరంగానే కాకుండా, వివిధ ప్రాంతాల్లో మతాల నిష్పత్తి కూడా మారనుంది. **- సహనం వందే, హైదరాబాద్**

2020 నాటి గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 227కోట్ల మంది క్రైస్తవులు ఉండగా,ముస్లింల సంఖ్య 202కోట్లు గా ఉంది.అప్పట్లో ఈ రెండు మతాల మధ్య 25 కోట్ల తేడా ఉం డేది.జనాభా పెరుగుదల వేగం ఇస్లాంలో ఎక్కువగా ఉండటం తో ఈ అంతరం క్రమంగా తగ్గుతోంది.2035 నాటికి ముస్లింల జనాభా 257 కోట్లకు చేరవచ్చని, క్రైస్తవుల సంఖ్య 252 కోట్ల పద్ద నిలవవచ్చని ప్యూ అంచనా చెబుతోంది. అంటే సుమారు ఐదు కోట్లు ఎక్కువగా ముస్లింలు మొదటి స్థానానికి రావచ్చు. ఈ మార్పు ఒక్కసారిగా జరిగేది కాదని,దశాబ్దాలుగా కొనసాగు తున్న జనాభా ధోరణుల వల్ల వస్తోందని పరిశోధకులు వివరిస్తున్నారు.

జననాల రేటే అసలు కారణం..

ఈ మార్పుకు మత మార్పిడుల కంటే పిల్లల జననాలే ప్రధాన కారణమని ప్యూ సీనియర్ జనాభా పరిశోధకుడు కాన్రాడ్ హ్యాకెట్ స్పష్టం చేశారు. 2020 నుంచి 2025 మధ్య కాలంలో ముస్లిం మహిళలు సగటున 3.1 మంది పిల్లలకు జన్మనివ్వగా, క్రైస్తవ మహిళల్లో ఈ సగటు 2.5గా ఉంది. ఇతర మతాల మహిళల్లో ఇది 1.6 మాత్రమే. ఒక తరం నుంచి మరో తరానికి జనాభా స్థిరంగా ఉండటానికి అవసరమైన భర్తీ స్థాయి సగటు 2.1గా ఉంటుంది. ముస్లిం తల్లులకు 2020-2025 మధ్య సుమారు 25.2 కోట్ల మంది పిల్లలు పుట్టగా, క్రైస్తవ తల్లులకు 20.8 కోట్ల మంది పుట్టారు. కుటుంబంలో పిల్లల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల యువ జనాభా పెరిగి, భవిష్యత్తులో జనాభా లెక్కలను మారుస్తోంది.

ప్రాంతాల వారీగా మారుతున్న చిత్రం

ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఈ మార్పులు భిన్నంగా కనిపిస్తున్నాయి. 2070 నాటికి సబ్ సహారా ఆఫ్రికా జనాభా పెరుగుదలలో కీలకంగా మారనుంది. ఆ నాటికి ప్రపంచంలోని క్రైస్తవుల్లో సగానికి పైగా అక్కడే ఉండొచ్చని, కాంగోలో క్రైస్తవుల సంఖ్య మూడు రెట్లు పెరిగి 27 కోట్లకు చేరవచ్చని అంచనా. మరోవైపు యూరప్ మొత్తం జనాభా 2070 నాటికి 17 శాతం తగ్గవచ్చని, అక్కడ క్రైస్తవుల సంఖ్య 50.5 కోట్ల నుంచి 32.4 కోట్లకు పడిపోవచ్చని ప్యూ చెబుతోంది. అమెరికాలోనూ క్రైస్తవుల వాటా 2065 నాటికి 50 శాతం కంటే తక్కువకు రావచ్చని, కెనడాలో 2030 నాటికే సగం కంటే తగ్గొచ్చని అంచనా. 2070 నాటికి ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు 360 కోట్లు దాటవచ్చని, క్రైస్తవులు 300 కోట్లకు కొద్దిగా తక్కువగా ఉండొచ్చని పరిశోధన చెబుతోంది.



మిగిలిన మతాలు... దేశాల లెక్కలు

హిందువులు, యూదుల జనాభా సంఖ్య పెరిగినా, ప్రపంచ మొ త్తం జనాభాలో వారి శాతం తగ్గవచ్చని ప్యూ అంచనా వేస్తోంది. చైనా, దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాల్లో జనాభా తగ్గుదల కారణంగా బౌద్ధుల సంఖ్యతో పాటు వారి వాటా కూడా తగ్గవచ్చు. చైనా మినహా ఇతర దేశాల్లో ఏ మతాన్నీ పాటించని వారి సంఖ్య 2070 నాటికి 18 కోట్లకు పైగా పెరగవచ్చని, దక్షిణ కొరియా, ఫ్రాన్స్, బ్రిటన్ వంటి దేశాల్లోనూ వీరు మెజారిటీ కావచ్చు. ఇక దేశాల వారీగా చూస్తే, 2070 నాటికి అత్యధిక ముస్లింలు ఉన్న దేశంగా పాకిస్తాన్ మారవచ్చని, ఆ తర్వాత భారత్, నైజీరియా, ఇండోనేషియా నిలవవచ్చని అంచ నా. భారత్‌లో ముస్లిం జనాభా వాటా పెద్దగానే ఉంటుంది.

ఘర్షణ కాదు.. అవగాహన అవసరం

జనాభా లెక్కల్లో వస్తున్న ఈ మార్పులను ఆధిపత్య పోరుగా లేదా నాగరికతల ఘర్షణగా చూడకూడదని హార్వర్డ్ స్కూల్ పరిశోధకురాలు గినా జుర్లో అభిప్రాయపడ్డారు. అలా భావిస్తే సమాజంలో అనవసరమైన ఆందోళనలు పెరిగే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. జనాభా పెరుగుదల అనేది జననాల రేటు, ఆయుర్దాయం, వలసలు వంటి సామాజిక అంశాల వల్ల జరిగే సహజ ప్రక్రియ. ఏ మతంలో ఎక్కువ మంది ఉన్నారన్న దానితో మనుషుల విలువను కొలవలేం. సంఖ్యల లెక్కలు ఎలా మారినా, మతాల మధ్య పరస్పర గౌరవం, అవగాహన, మానవ సంబంధాలు మాత్రం చెక్కుచెదరకుండా ఉండటమే సమాజానికి మేలు చేస్తుంది.